## నిందితుడికి ఐదేండ్ల జైలు శిక్ష

కామారెడ్డి, మే 21 : భార్యను కత్తితో పొడిచి హత్య చేసేందుకు యత్నించిన భర్తకు ఐదేండ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేశ్‌చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండలం మర్లకుంట తండాకు చెందిన బదావత్ తేజా నాయక్ తన కూరుతు స్వాతిని మాచారెడ్డికి చెందిన విస్లావత్ లచ్చిరామ్‌కు ఇచ్చి 12 ఏండ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఒక కూతురు ఉన్నది. తన అల్లుడు తాగుడుకు బానిసై అదనపు కట్నం కోసం భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. కులంలో ఎన్నో సార్లు పంచాయితీ పెట్టి మాట్లాడినా.. వినక పోవడంతో తన కూతురు స్వాతిని మాచారెడ్డి నుంచి మర్లకుంట తండాకు తెచ్చుకున్నాడు. ఇదిలా ఉండగా 2022 ఫిబ్రవరి 26వ తేదీన గాంధారి గ్రామానికి స్వాతి టైలరింగ్ నిమిత్తం వెళ్లింది. భర్త విస్లావత్ లచ్చిరామ్ ఒక వాహనంపై వచ్చి తనతో తెచ్చుకున్న కత్తిని తీసి స్వాతిపై దాడి చేయగా ఎడమ చేతికి, చెంపపై గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం దవాఖానకు తీసుకెళ్లారు. గాంధారి పోలీసు స్టేషన్‌లో తండ్రి తేజానాయక్ తన కూతురును చంపాలనే ఉద్దేశంతో అల్లుడు విస్లావత్ లచ్చిరామ్ ప్రయత్నించాడని ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో సాక్షులను విచారించి, సాక్షాధారాలను పరిశీలించి నేరం రుజువు కాడంతో అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ సుమలత నిందితుడికి ఐదేండ్ల జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధించినట్లు తెలిపారు. పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ దామోదర్‌రెడ్డి, ఈ కేసును సరైన పద్ధతిలో విచారించిన అప్పటి గాంధారి ఎస్సై సాయిరెడ్డి, ప్రస్తుత ఎస్సై ఆంజనేయులు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, సీడీవో రమేశ్‌ను ఎస్పీ అభినందించారు.

## నలుగురి రిమాండ్

లింగంపేట, మే 21 : మండలంలోని భవానీపేట గ్రామంలో రాళ్లు పేల్చిన ఘటనలో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ ఎస్సై రాఘువేంద్ర తెలిపారు. భవానీపేట గ్రామంలోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో భూమి అభివృద్ధి చేయడానికి అనుమతులు లేకుండా భూమి యజమాని దర్శనం సిద్దిరాములు రాళ్లు పేల్చినట్లు తెలిపారు. రాళ్లు పేల్చడంతో సమీపంలోని గృహాలు ధ్వంసమైనట్లు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి భూమి యజమాని దర్శనం సిద్దిరాములుతోపాటు ఆరెపల్లి నర్సింహులు, ఒడ్డె రమేశ్, మంజ సుభాష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీరి వద్ద కంప్రెషర్ కలిగిన ట్రాక్టర్, జేసీబీ, బ్యాటరీ, జిలెటిన్ స్టిక్స్, వైర్లతోపాటు డిటోనేటర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## పాము కాటుతో నాలుగేండ్ల బాలుడు మృతి

నస్రుల్లాబాద్, మే 21 : మండలంలోని సంగం గ్రామానికి చెందిన రిషి కుమార్(4) పాము కాటుతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సంగం గ్రామానికి చెందిన అశోక్, సుజాతకు ముగ్గురు అమ్మాయిలు కాగా నాలుగో సంతానం రిషి కుమార్ జన్మించాడు. బుధవారం ఇంట్లో ఆడుకుంటున్న సమయంలో పాము కాటు వేయడంతో తల్లికి బాలుడు తెలిపాడు. హుటాహుటిన బాన్సువాడ దవాఖానకు తరలించి అక్కడ నుంచి నిజామాబాద్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందనట్లు తెలిపారు. స్థానికులు పామును చంపేశారు.

## యువకుడి అదృశ్యం

రామారెడ్డి, మే 21 : మండల కేంద్రానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు స్థానిక ప్రొబేషనరి ఎస్సై నవీన్‌చంద్ర తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నామాల శ్రీనివాస్ ఈ నెల 14వ తేదీన ఖమ్మం జిల్లాలో మత్స్యకారుల శిక్షణ శిబిరానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇతర భాషలో మాట్లాడడంతో భార్య నామాల సౌందర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# దంచి కొట్టిన వాన

- రామారెడ్డిలో ఇండ్లలోకి చేరిన వర్షపు నీరు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు



లింగంపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



పోచారం పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు



మాచారెడ్డిలో కురుస్తున్న వర్షం

కామారెడ్డి/నాగిరెడ్డిపేట/లింగంపేట/రామారెడ్డి/ నస్రుల్లాబాద్/మాచారెడ్డి, మే 21 : జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి, బుధవారం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. తడిసిన వడ్లను ఆరబోసుకుందామనుకునే లోపు చెడగొట్టు వాన కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి పట్టణంలోని గంజ్‌లో రైతులు ఆరబోసుకున్న వడ్లు పూర్తిగా తడిసిపోయాయి. నాగిరెడ్డిపేట మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రెండు నుంచి మూడు గంటలపాటు భారీ వర్షం కురవడంతో.. పొలం మడులు నిండిపోయాయి. మండల కేంద్రంలో చేపట్టిన రహదారి పనులు మధ్యలో నిలిచిపోవడంతో.. ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం కుప్పలు తడిసిపోవడంతో.. రైతులు ఆవేదన చెందుతున్నారు. లింగంపేటలో గంటన్నరకుపైగా భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. లింగంపేటలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. పంట పొలాల్లో వరదనీటితో నిండిపోయాయి. రామారెడ్డిలో బుధవారం తెల్లవారు జాము న కురిసిన భారీ వర్షానికి పలు గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలైన దళితవాడ, మంగలివాడ, గాంధీ వెనుక ఉన్న గృహాల్లోకి వర్షం నీరుచేరింది. దీంతో వర్షపు నీటిని ఎత్తి పోసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమను



నస్రుల్లాబాద్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎండకాలంలో కురిసిన వర్షానికే ఇంతలా కష్టం ఉంటే.. వర్షాకాలంలో కురిసే వానలకు ఇంకెంత కష్టం అనుభవించాలోనని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. డ్రైనేజీలు, రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. జిల్లాలో అత్యధికంగా నస్రుల్లాబా ద్‌లో 66.5 మిల్లీ మీటర్లు, బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో 66.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. మాచా రెడ్డితో పాటు గజ్యానాయక్‌తండా, ఘన్‌పూర్, కాకులగుట్టతం డా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లగా మారిపోయింది. కొద్ది రోజుల నుంచి దంచి కొడుతున్న ఎండలకు ఉపశమనం లభించినట్లయ్యింది.



కామారెడ్డిలో ధాన్యాన్ని తీసుకెళ్తున్న పొక్లెనర్



పోచారం పాఠశాలలో కూలిపోయిన ప్రహరీ

### పోచారం పాఠశాలలో కూలిన ప్రహరీ, నిలిచిన నీరు..

నాగిరెడ్డిపేట, మే 21 : మండలంలోని పోచారం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కూలిపోయి నీరు పాఠశాల గదుల్లోకి చేరింది. మూత్రశాలలు, మరగుదొడ్లు పూర్తిగా నీటితో నిండిపోయంటూ.. గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం మీదుగా నూతన రహదారి విస్తరణ పనుల్లో డ్రైనేజీ నిర్మించకుండానే గుత్తేదారు పాఠశాల ప్రహరీ వరకు మట్టిని వేసి పనులు చేపట్టాడు. దీంతో పది రోజుల క్రితం కురిసిన వర్షానికి ప్రహరీ కూలి నీరు పాఠశాలలోకి చేరింది. కాగా బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పాఠశాల ఖాళీ స్థలంతోపాటు గదులు, మరుగుదొడ్లు పూర్తిగా నీటితో నిండిపోయాయి. బుధవారం పాఠశాలలో కూతురు పెండ్లి చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్న పేద కుటుంబం వేసిన టెంట్లు, శామియాలు, వంట సామగ్రి పూర్తిగా నీటితో తడిసిపోయాయి. మరో చోట పెండ్లి కార్యక్రమం నిర్వహించుకున్నారు. హైవే అధికారులు స్పందించి పాఠశాల పక్కనుంచి డ్రైనేజీతోపాటు ప్రహరీని నిర్మించాలని కోరుతున్నారు.

## జాగృతి రాష్ట్ర యూత్ కన్వీనర్ సంపత్‌గౌడ్‌కు సన్మానం



సంపత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నాగిరెడ్డిపేట, మే 21 : జాగృతి రాష్ట్ర యూత్ కన్వీనర్‌గా నియామకమైన ఎదురుగట్ల సంపత్‌గౌడ్‌ను నాగిరెడ్డిపేట బీఆర్‌ఎస్ నాయకులు వంశీకృష్ణాగౌడ్, బాబురావు, బాగారెడ్డి, బషీర్ ఐలాపూర్‌లోని ఆయన స్వగృహంలో బుధవారం సన్మానించారు. అందరి కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ.. ముందుకు వెళ్తున్న ఆయనకు రాష్ట్ర జాగృతి యూత్ కన్వీనర్‌గా నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

## కొడుకును హత్యచేసిన తండ్రి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య

కామారెడ్డి, మే 21 : డబ్బుల కోసం వేధిస్తున్నాడని కొడుకును తండ్రి హత్య చేశాడని ఏఎస్పీ చైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌కు చెందిన వడ్ల నిఖిల్ రెండు నెలల క్రితం దుబాయి నుంచి వచ్చాడు. అప్పటి నుంచి చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. ఈ వేధింపులను భరించలేక ఈ నెల 19వ తేదీన తండ్రి వడ్ల భాస్కర్ రాడ్‌తో నిఖిల్ తలపై కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిఖిల్ సోదరి రాళ్లపల్లి ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం పోలీసులు భాస్కర్‌ను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్, రక్తపు మరకలు ఉన్న చొక్కా, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఏఎస్పీ అన్నారు. సమావేశంలో రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు పాల్గొన్నారు.

## అర్హులకే గృహాలు మంజూరు

లింగంపేట, మే 21 : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయనున్నట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వెల్లడించారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారదర్శకంగా విచారణ చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేయడంపై వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్, ఎంపీడీవో నరేశ్, మండల పంచాయతీ అధికారి మల్హరీ, స్థానిక నాయకులు నారాగౌడ్, ట్రాన్స్ కో డీఈఈ మల్లేశం, దశరథ్ నాయక్, ఎల్లమయ్య, మోహిద్, రఫీక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బాధితులకు చెక్కులు పంపిణీ**

ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో సంభవించిన విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన బాధిత కుటుంబీకులకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ చేశారు. లింగంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈఈ విజయసారథి, ఏడీఈ మల్లేశ్, ఏఈ సాయినాథ్, స్థానిక నాయకులు బుర్ర నారాగౌడ్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇందిరమ్మ గృహాలకు కొలతలు, భూమిపూజ**

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి రూరల్/బీబీపేట్, మే 21 : నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎంపీడీవో ప్రభాకర్ బుధవారం కొలతలు వేసి పనులు ప్రారంభించారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. గ్రామంలో 27 ఇండ్లు మంజూరైనట్లు పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ఏఈ పిచ్చయ్య, స్థానిక నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జీవరత్నం, బాలాగౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జాన్కంపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు చేసిన మార్కింగ్ పనులను ఎంపీడీవో ప్రకాశ్ పరిశీలించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఉన్నారు. బీబీపేట, దోమకొండ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో నాయకులు, అధికారులు కలిసి ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోశారు. బీబీపేటలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, స్థానిక నాయకులు రమేశ్, పాత రాజు, భూమాగౌడ్, మహేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I Have been Known and Called With Two Names KURMASHETTY GANGADHAR Alias GANGADHAR KURMASHETTY S/o. GANGARAM KURMASHETTY Alias KURMASHETTY GANGARAM,R/o H.No.1-70/A Vill: Palem, Mdl: Morthad, Dist. Nizamabad.
NTZ-338660

**WANTED**

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఎల్లారెడ్డిలో వృత్తి నైపుణ్య శిక్షణా శిబిరం

ఎల్లారెడ్డి రూరల్, మే 21 : ఎల్లారెడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో వృత్తి నైపుణ్య శిక్షణా శిబిరానికి ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చదువుకొని ఉద్యోగం లేకుండా ఉన్న వారికి వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 2017 నుంచి కళాశాలలో చదువుకొని ఇప్పటివరకు ఎలాంటి ఉద్యోగం రానివారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఉపాధి పొందేలా చేయడానికి ప్రభుత్వ సహకారంతో ఉన్నతి ఫౌండేషన్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమన్వయకర్త, కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు కోరారు.

## మొక్కలను రక్షించే బాధ్యత ఎస్‌హెచ్‌జీ సభ్యులదే..



మహిళా స్వయం సహాయక బృంద సభ్యులకు కిట్లను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్

ఎల్లారెడ్డి రూరల్, మే 21 : ఇకనుంచి మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులదేనని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్దచెరువు కట్టపై ఆయన అమృత్ మిత్ర 2.0 కార్యక్రమంలో భాగంగా మెప్మా పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు బుధవారం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ రవిశంకర్, మెప్మా ఆర్పీ కిరణ్, మహిళా స్వయం సహాయ సంఘాల సభ్యులు ఉన్నారు.

## బాన్సువాడలో తిరంగ ర్యాలీ



బాన్సువాడ, మే 21 : భారత సైనిక దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడాన్ని పురస్కరించుకొని బుధవారం బాన్సువాడలో జాతీయ పతాకాలతో తిరంగ ర్యాలీ నిర్వహించారు.

## పోక్సో, సైబర్ నేరాలపై అవగాహన

బాన్సువాడ, మే 21 : బాన్సువాడలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో బుధవారం షీటీం సభ్యులు పాల్గొని సైబర్ నేరాలు, పోక్సోచట్టంపై అవగాహన కల్పించారు. మహిళల కోసం షీటీం సభ్యులు అందుబాటులో ఉంటారని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు ప్రియాంక, అనిల్ తదితరులు ఉన్నారు.

# ఆలయాల నిర్మాణాలతో ముదిరాజ్‌లో ఐక్యత



పర్మళ్లలో మాట్లాడుతున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్



లింగంపేటలో బండ ప్రకాశ్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

లింగంపేట/కామారెడ్డి, మే21: పెద్దమ్మ ఆలయాల నిర్మాణంతో ముదిరాజుల్లో ఐక్యత పెంపొందుతుందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. లింగంపేట మండలం పర్మళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, టీజేఏఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్, ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మారెడ్డి రజితా వెంకట్రాంరెడ్డి, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు విఠల్, మండల అధ్యక్షుడు సాయికుమార్, పర్మళ్ల గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు. లింగంపేటలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి యువ జన విభాగం కన్వీనర్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నాయకులు గాండ్ల నర్సింహులు, గన్ను నాయక్, ఆకుల సత్యం, మర్కంటి బుచ్చన్న, బట్టు విఠల్, చందు, బొల్లు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. కామారెడ్డిలో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్‌కు జిల్లా ముదిరాజ్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు భిక్షపతి, సంఘం నాయకులు సత్తయ్య, రమేశ్, విఠల్, నాగరాజు, వివిధ గ్రామాల ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

# భిక్కనూరు సింగిల్ విండో సీఈవోను తొలగిస్తూ తీర్మానం



ఇన్‌చార్జి సీఈవోగా రవికిరణ్‌కు నియామక పత్రం అందజేస్తున్న విండో చైర్మన్ భూమయ్య

భిక్కనూరు, మే 21 : భిక్కనూరు సింగిల్ విండో సీఈవోను తొలగిస్తూ పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సహకార శాఖ ఆదేశాల మేరకు భిక్కనూరు సింగిల్ విండోలో విధులు నిర్వహిస్తున్న సీఈవో నర్సింహులును తొలగిస్తున్నట్లు విండో చైర్మన్ గంగళ భూమయ్య తెలిపారు. సింగిల్ విండోలో బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా తీర్మానం చేసి, నర్సింహులును తొలగించామని, ఆయన స్థానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న రవి కిరణ్‌కు ఇన్‌చార్జి సీఈవోగా నియమిస్తూ పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు ముచ్చర్ల రాజిరెడ్డి, డైరెక్టర్లు నర్సింహులు, ఉప్పరి సాయిలు మల్లేశం, మహిపాల్‌రెడ్డి, జేపీ వెంకట్ గౌడ్, జయమ్మ పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలి



ఎల్లారెడ్డి మోడల్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, మే 21: పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందుగా చేరుకోవాలని ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల సీఎస్‌లు లక్ష్మణ్‌సింగ్, నిజాముద్దీన్ సూచించారు. బుధవారం వారు మాట్లాడుతూ.. నేటి నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్ సప్లిమెంటరీ ప్రథమ సంవత్సర పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఈ పరీక్షలు ఈ నెల 29వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. మోడల్ కళాశాల పరీక్ష సెంటర్‌కు పరీక్షల సీఎస్‌గా లక్ష్మణ్ సింగ్, డీవోగా రుక్మిణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌కు పరీక్షల సీఎస్‌గా నిజాముద్దీన్, డీవోగా సంతోష్‌కుమార్ విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

## దవాఖాన నిర్మాణానికి స్థల పరిశీలన

బిచ్కుంద, మే 21 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న వంద పడకల దవాఖాన కోసం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధికారులతో కలిసి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాగర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కుమార్, స్థానిక నాయకులు గంగాధర్, రవి పటేల్, అశోక్, మల్లికార్జున్ అప్ప, విఠల్ రెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే తొలగిస్తాం

కామారెడ్డి, మే 21 : జిల్లా కేంద్రంలో అనధికార హోర్డింగ్స్, ఫ్లెక్సీలను ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తే తొలగిస్తామని మున్సిపల్ కమిషన్ రాజేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోర్డింగ్స్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేముందు మున్సిపల్ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఫ్లెక్సీలు తయారు చేసే యజమానులు కూడా మున్సిపల్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాతనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. గడువు ముగిసిన వెంటనే వాటిని తొలగించాలని తెలిపారు. లేని యెడల మున్సిపల్ సిబ్బంది తొలగించి, జరిమానా విధిస్తామని తెలిపారు.

## లారీని ఢీకొన్న కంటెయినర్ : ఒకరి మృతి



నుజ్జునుజ్జు అయిన లారీ ముందు భాగం

కామారెడ్డి రూరల్, మే 5 : లారీని వెనుక నుంచి కంటెయినర్ ఢీకొన్న ఘటన కామారెడ్డి మండలం దేవునిపల్లి పీఎస్ పరిధిలోని టేక్రియాల్ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకున్నది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న రాజస్థాన్ లారీని వెనుకాల నుంచి వస్తున్న మహారాష్ట్ర కంటెయినర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా కామారెడ్డి ఏరియా దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతి చెందిన డ్రైవర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఆటో, కారు ఢీ : ఎనిమిది మందికి గాయాలు

నస్రుల్లాబాద్, మే 21 : మండలంలోని దుర్కి గ్రామ శివారులో బుధవారం ఆటోను కారు ఢీ కొన్న ఘటన చేటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ నుంచి నస్రుల్లాబాద్ వైపు ఏడుగురు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను, నిజామాబాద్ నుంచి బాన్సువాడకు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురితో సహా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను బాన్సువాడ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

## గిరిజనులకు అవగాహన సదస్సు

నస్రుల్లాబాద్, మే 21 : మండలంలోని సంగం గ్రామంలో బుధవారం ధర్తీ ఆబా జం జాతీయ గ్రామ్ అభియాన్ పథకంపై అవగాహ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి సమీకృతి యోజన కింద గిరిజనులకు పథకం ప్రారంభించారన్నారు. గిరిజనులు చేపల చెరువులు, చేపల ఆధారిత వ్యాపారం చేయడానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.